# నమస్తే తెలంగాణ
DISTRICT SUPPLEMENT

## మంచిర్యాల
## కుమ్రం భీం ఆసిఫాబాద్

సోమవారం 16 అక్టోబర్ 2023 | MONDAY, OCTOBER 16, 2023 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD | పేజీలు PAGES : 12


## ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు

- నగదు, మద్యం, ఉచిత పంపిణీలపై ప్రత్యేక నిఘా
- కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్‌కుమార్
- చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీ

.. వివరాలు 2లో



కాగజ్‌నగర్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ సురేశ్ కుమార్







సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీ-ఫామ్స్ అందుకుంటున్న బాల్క సుమన్(చెన్నూర్), నడిపెల్లి దివాకర్ రావు (మంచిర్యాల), దుర్గం చిన్నయ్య(బెల్లంపల్లి ), కోవ లక్ష్మి (ఆసిఫాబాద్), కోనేరు కోనప్ప(సిర్పూర్ )

# బీ-ఫామ్స్ జోష్

- ఉమ్మడి జిల్లాలో పది మందికి అందజేసిన సీఎం కేసీఆర్
- ఒక్కో అభ్యర్థికి రెండేసి చొప్పున బీఆర్‌ఎస్ బీ-ఫామ్స్

**బీఆర్‌ఎస్ పార్టీ తరఫున** అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్న ఎమ్మెల్యే అభ్యర్థులకు ఆదివారం సీఎం కేసీఆర్ బీ-ఫామ్స్ అందజేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది మందికి ఇచ్చారు. ఒక్కొక్కరికి రెండు బీ-ఫామ్స్‌తోపాటు, రూ.40 లక్షల విలువ గల చెక్కులు అందించారు. తెలంగాణ భవన్‌లో బీ-ఫామ్స్ ఇచ్చిన అనంతరం కేసీఆర్ మాట్లాడారు. బీ-ఫామ్స్ నింపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సందేహాల నివృత్తికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. అభ్యర్థులు నిత్యం ప్రజల్లోనే ఉండాలని, ప్రతి చిన్న కార్యకర్తతో మాట్లాడే ప్రయత్నం చేయాలని సూచించారు. ఎవరికైతే అవకాశం రాలేదో వారు తొందరపడాల్సిన అవసరం లేదన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా సెలెక్ట్ అవ్వడమే ఫైనల్ కాదని, రానున్న రోజుల్లో ఎన్నో అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో బీ-ఫామ్స్ అందుకున్న వారిలో.. ఇంద్రకరణ్‌రెడ్డి(నిర్మల్), బాల్క సుమన్ (చెన్నూర్), జోగు రామన్న (ఆదిలాబాద్), అనిల్ జాదవ్(బోథ్), విఠల్‌రెడ్డి(ముథోల్), జాన్సన్ నాయక్(ఖానాపూర్), దివాకర్‌రావు(మంచిర్యాల), దుర్గం చిన్నయ్య(బెల్లంపల్లి), కోవ లక్ష్మి(ఆసిఫాబాద్), కోనేరు కోనప్ప(సిర్పూర్(టీ) ఉన్నారు.

*- మంచిర్యాల ప్రతినిధి/కుమ్రం భీం ఆసిఫాబాద్, అక్టోబర్ 15(నమస్తే తెలంగాణ)*

## కేసీఆర్ హామీలు అద్భుతం



సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు అద్భుతంగా ఉన్నాయి. ఒక పేద కుటుంబం మూడు నుంచి నాలుగు పథకాల ద్వారా లబ్ధి పొందేలా మ్యానిఫెస్టో ఉంది. తెల్ల రేషన్‌కార్డు ఉంటే ఐదు లక్షల ఇన్సూరెన్స్ వస్తది. ఆరోగ్య శ్రీ కింద రూ.15 లక్షల వరకు వైద్య సదుపాయం కలుగుతది. రూ.400కే గ్యాస్ సిలిండర్ వస్తది. మహిళలకు రూ.3వేల గౌరవ భృతి వస్తుంది. సన్న బియ్యం వస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే పేద కుటుంబం ఎవరిపైనా ఆధారపడకుండా బతికే రోజులు వస్తయ్. ఓటు వేసే ముందు ప్రతి ఒక్కరూ ఈ హామీలను తలచుకోవాలి. మూడోసారి గెలిస్తే కచ్చితంగా ఈ హామీలను అమలు చేస్తదనే నమ్మకం ఉంది. ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఈ హామీలు తోడైతే మూడోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తది.

*- రాజేంద్రప్రాణి, ప్రముఖ విద్యావేత్త, మంచిర్యాల.*



రామకృష్ణాపూర్ : స్వీట్లు తినిపించుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు



మంచిర్యాల అర్బన్ : ఐబీలో పటాకులు కాల్చుతున్న బీఆర్‌ఎస్ నాయకులు




# మ్యానిఫెస్టో జోర్‌దార్

### సకల జనులకు ఆమోదయోగ్యంగా బీఆర్‌ఎస్ ప్రణాళిక

- కేసీఆర్ బీమా, పింఛన్లు, రైతుబంధు, ఆరోగ్యశ్రీ ఇన్సూరెన్స్ పెంపు
- అర్హులైన మహిళలకు గౌరవ భృతి.. మహిళా సంఘాలకు భవనాలు
- పేదలకు ఇండ్ల స్థలాలు, గిరిజనేతరులకు పోడు పట్టాలు
- ప్రభుత్వ ఉద్యోగులకు ఓపీఎస్ అమలుపై అధ్యయన కమిటీ
- ప్రకటనలపై సబ్బండవర్గాల హర్షాతిరేకాలు.. ..4,5,8లో

**భారత రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్)** అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టో జోర్‌దార్‌గా ఉంది. జన రంజకంగా, సకల జనుల ఆమోదయోగ్యంగా రూపొందించారు. హ్యాట్రిక్ కొట్టడమే లక్ష్యంగా అన్ని కులాలు, వర్గాలు, మతాలకు సమ ప్రాధాన్యం ఇచ్చారు. ప్రతి పేద కుటుంబానికి మూడు నుంచి నాలుగు పథకాలతో లబ్ధి చేకూరేలా ప్రణాళిక తయారు చేశారు. అర్హులైన మహిళలకు గౌరవ భృతి, మహిళా సంఘాలకు భవనాలు, పేదలకు ఇండ్ల స్థలాలు, గిరిజనేతరులకు పోడు పట్టాలు, అసైన్డ్ భూములకు పట్టాలు, ప్రభుత్వ ఉద్యోగులకు ఓపీఎస్ అమలుపై అధ్యయన కమిటీ వంటి వాటితోపాటు చెప్పుకుంటూ పోతే అనేకం మేలు జరిగే పథకాలే ఉన్నాయి. అందరినీ దృష్టిలో ఉంచుకొని ఎవరికీ ఏం కావాలో తెలుసుకొని మ్యానిఫెస్టో తయారు చేశారని ప్రజలు చర్చించుకుంటున్నారు. కాగా.. ప్రకటనలపై సబ్బండ వర్గాలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తుండగా.. బీఆర్‌ఎస్ శ్రేణులు పటాకులు కాల్చి, మిఠాయిలు పంచుకొని సంబురాలు చేసుకున్నాయి.

*- మంచిర్యాల ప్రతినిధి/కుమ్రం భీం ఆసిఫాబాద్, అక్టోబర్ 15(నమస్తే తెలంగాణ)*